విశాలాంధ్ర అనకాపల్లి
శుక్రవారం 23, ఆగస్టు, 2024

గ్రామసభలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - కే.కోటపాడు: ప్రభుత్వ ఆదేశాలతో ఏర్పాటు చేస్తున్న గ్రామసభలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని స్థానిక ఎంపీడీవో ఎస్.అప్పలరాజు తెలిపారు. శుక్రవారం అన్ని గ్రామాల్లో ఏకకాలంలో జరుగుతాయని, ప్రజలు గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి గ్రామసభల్లో తెలియజేయాలన్నారు. 33 గ్రామ పంచాయ తీలకు కార్యదర్శులతోపాటు మరో 20 మంది సూపర్‌వైజర్ అధికారులను కూడా ఏర్పాటు చేశామన్నారు.

ఎసెన్షియా ఫార్మా ప్రమాదంపై విచారణ జరపాలి

నెహ్రూ చౌక్ వద్ద సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అచ్యుతాపురం సెజ్ రాంబిల్లి ఎసెన్షియా ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదాన్ని నిరసిస్తూ సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గల నెహ్రూ చౌక్ వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ ఎసెన్షియా ఫార్మా పరిశ్రమ ప్రమాదం కేవలం యాజమాన్య నిర్లక్ష్యమేనని, ఈ ఘటన జరిగి అర్ధరాత్రి అవుతున్న ప్రమాదం గురైన కార్మికుల గాని ఉద్యోగులు గాని ఎక్కడున్నారో వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంలో పూర్తిగా ప్రభుత్వ అధికారులు, యాజమాన్యం పూర్తిగా విఫలం చెందారన్నారు. అనేకమంది కుటుంబ సభ్యులు వచ్చి పరిశ్రమ వద్ద తమ వారి ఆచూకీ తెలియజేయాలని మనోవేదానికి గురైనా యాజమాన్యం, అధికారుల్లో చలనం లేదన్నారు. అధికారికంగా 18 మంది చనిపోయారని ఇంకా 41 మందికి గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలియజేశారు. ఈ రకంగా కనీసం కుటుంబ సభ్యులకు కూడా ఆచూకీ చెప్పకపోవడం చాలా దారుణమైన పరిస్థితి అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎసెన్షియా ఫార్మా పరిశ్రమ సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టి దీనికి కారుకులైన యాజమాన్యంపైన క్రిమినల్ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని, తరచూ ఇటువంటి సంఘటనలు జరగడానికి కారకులైన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రతినెల సేఫ్టీ ఆడిట్స్ నిర్వహించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసి ప్రజల ప్రాణాలు కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అప్పలరాజు, జిల్లా నాయకులు దేవుడుబాబు, సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి.సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు కోన లక్ష్మణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాబ్జి, ఫణీంద్ర కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కన్నబాబు, వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

జ్యూవెలరీ డిజైనింగ్‌కు సృజనాత్మకత అవసరం

వృత్తి నైపుణ్య శిక్షకులు జ్యోతి కొఠారి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జ్యూవెలరీ డిజైనింగ్‌కు సాంకేతిక నైపుణ్యం అవసరమని జ్యూవెలరీ డిజైనర్, వృత్తి నైపుణ్య శిక్షకులు జ్యోతి కొఠారి (ముంబాయి) పేర్కొన్నారు. శ్రీ గౌరీ గ్రంథాలయంలో గురువారం 'జ్యూవెలరీ డిజై నింగ్'పై జరిగిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడుతూ జ్యూవెలరీ డిజైన్లు సృజనాత్మకత మీద ఆధారపడి ఉంటు ందన్నారు. ఆభరణాల రూపకల్పన అనేది నగల రూపకల్పన సృష్టించే కళ లేదా వృత్తి అన్నారు. డిజైనర్ ప్రతిభ, నైపుణ్యాలను బట్టి ఆదాయం సమకూరుతు ందన్నారు. ఒక సాధారణ ఫ్రీలాన్స్ జ్యూవెలరీ డిజైనర్ నెలకు రూ.10 వేలు నుండి రూ.30 వేలు వరకు సంపాదించ వచ్చన్నారు. జ్యూవెలరీ డిజైనింగ్ అన్ని దేశాల్లో గొప్ప పరిధిని కలిగి ఉన్న వృత్తి అని అన్నారు. జ్యూవెలరీ డిజైన్ అనేది ఫ్యాషన్, వినోద పరిశ్రమల విస్తరణతో అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ అన్నారు. ఏదైనా ఆభరణాల వస్తువును తయారు చేసే ముందు, దానిని కాగితంపై గీయడం చాలా ముఖ్యమని, గులాబీ-గోల్డ్, డైమండ్ జ్యూవెలరీ డిజైనింగ్‌లో ఆభరణాల తయారీ తరగతులు సహాయపడతాయన్నారు. ఈ సందర్భంగా డ్రాఫ్టింగ్, డిజైనింగ్, షేడింగ్ నైపుణ్యాల మెరుగుదలకు తీసుకోవాల్సిన అంశాలు గురించి జ్యోతి కొఠారి వివరించారు. శ్రీ గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ ఔత్సాహికుల అభిరుచుల మేరకు గ్రంథాలయం ఆధ్వర్యంలో మరిన్ని వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. జ్యూవెలరీ డిజైనర్ కావడానికి అండర్ గ్రాడ్యుయేట్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలో కోర్సును ప్రతి ఒక్కరూ అభ్యసించ వచ్చన్నారు. శ్రీ గౌరీ గ్రంథాలయ మాజీ అధ్యక్షుడు కర్రి శివ, సభ్యులు బొడ్డేడ జగ్గఅప్పారావు, వృత్తి నైపుణ్య శిక్షకులు రాపేటి ప్రేమలత, మళ్ల మౌనిక, గిలకంశెట్టి నాగమణి పాల్గొన్నారు.

ఎసెన్షియా ఫార్మా యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

విశాలంధ్ర - అచ్యుతాపురం: సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్సుడ్ ప్రైమ్ లిమిటెడ్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలిన ప్రమాదంలో 18 మంది కార్మికులు మృతి చెందారని, ఒక్కొక్క కార్మిక కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము డిమాండ్ చేశారు. గురువారం అచ్యుతాపురం జంక్షన్‌లో సీఐటీయూ నిర్వహించిన రాస్తారోకోలో మాట్లాడుతూ ఎసెన్షియా ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి కంపెనీ యాజ మాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రమాదంలో 35 మందికి పైగా కార్మికులు క్షతగాత్రులయ్యారని, అనేక మంది కార్మికులకు కాళ్లు, చేతులు విరిగిపోవడమే కాకుండా తలకు బలమైన గాయాలు కూడా అయ్యాయన్నారు. ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను యాజమాన్యాలు గాలికి వదిలేస్తున్నాయని, భద్రతా ప్రమాణాలు పాటించడంలో ఫార్మా కంపెనీలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే కమిటీల పేరుతో హడావడి చేస్తున్నారని, కంపెనీల్లో ఉన్న లోపాలపై నిరంతరం తనిఖీలు చేయడంలేదని, ప్రమాదాలు సంభవిస్తున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ పారిశ్రామిక వేత్తలతో సమావేశం నిర్వహించిన నెల రోజుల్లోనే మూడు ప్రమాదాలు సంభవించాయంటే రాష్ట్ర ప్రభుత్వం, పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయో అర్థమౌతుందన్నారు. గతంలో సెజ్‌ల్లో జరిగిన ప్రమాదాలపై అధికార యంత్రాంగంతో కమిటీలు వేసి విచారణ నిర్వహించారని, ఆ కమిటీలు ఇచ్చిన నివేదికలు బహిర్గతం చేసి కంపెనీ యాజమాన్యాలపై చర్యలు తీసుకొని వుంటే నేడు ఇలాంటి ప్రమాదాలు మరలా సంభవించేవి కాదన్నారు. వెంటనే ప్రమాదాలకు కారణమైన కంపెనీపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కే.సోమినాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు, సిహెచ్ రామకృష్ణ, ముఠా సంఘం నాయకులు ఆర్.సత్తిబాబు, సిహెచ్.శివాజీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రె అప్పారావు, ఎస్.బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు గుర్తింపులో మార్పులు చేయాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల: ఉపాధి హామీ గ్రామ సభల్లో పనులు గుర్తింపులో మార్పులు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.భవానీ, గిరిజన సంఘం నాన్ షెడ్యూల్డ్ ఏరియా జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి కోరారు. ఈ మేరకు గురువారం మాడుగుల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గోపాలరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి హామీ పనులు గుర్తింపుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 38 రకాల పనులు గుర్తించాలని, దీనికి 23న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించాలని నిర్ణయించిందని తెలిపారు. ఉపాధి హామీ చట్టం ఏర్పడినప్పుడు రైతులకు వ్యవసాయ పనులు లేని సమయంలో వ్యవసాయ కార్మికులకు, సన్న చిన్నకారు రైతులకు పనులు కల్పించే ఉద్దేశ్యంతో నాడు వామపక్ష ప్రజాసంఘాల ఒత్తిడితో యుపిఏ 2 ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ చట్టం చేసిందన్నారు. పనులు గుర్తింపునకు ప్రయత్నం చేస్తుందని, దీన్ని పున: పరిశీలన చేయాలని కోరారు. ప్రభుత్వం సూచించిన పనులు గుర్తింపులో మెటీరియల్ చార్జీల ద్వారా ఎక్కువగా చేయవలసిన పనులు ఉన్నాయని తెలిపారు. ఇందులో చెరువులు లింక్ రోడ్లు, శ్మశాన వాటికలకు రోడ్లు వంటి పనులు కూడా గుర్తించాలని కోరారు. లేదంటే కూలీలకు పనులు తగ్గిపోతాయని తెలిపారు. వెంటనే గ్రామసభల్లో ఉపాధి కూలీలకు ఉపయోగపడే పనులు గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పాల్గొన్నారు.

పాయకరావుపేటలో శాంతి ర్యాలీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు, పుర ప్రముఖులు, సంస్థ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి సూర్య మహల్ సెంటర్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అని నినాదాలు చేశారు. మానవతా సంస్థ వ్యవస్థాపకులు ఎస్.రామచంద్రారెడ్డి జంగారెడ్డిగూడెంలో 108 మంది సభ్యులతో సంస్థను స్థాపించారని, నేటికి రాష్ట్ర వ్యాప్తంగా 120 శాఖలతో, 80 వేల మంది సభ్యులతో సంస్థ నడుస్తుందని తెలిపారు. ర్యాలీలో నాయకులు తోట నగేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, పెదిరెడ్డి శ్రీను, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, జగతా శ్రీనివాస్, యాళ్ల వరహాల బాబు, వెలుగుల అర్జున రావు, పెదిరెడ్డి ప్రసాద్, ధనిశెట్టి బాబురావు, మామిడి వెంకటేశ్వరరావు, గొల్లపల్లి నాగు, వైఎస్ ప్రసాద్, కొత్తపల్లి చిట్టిబాబు, కరుటూరు లక్ష్మీనారాయణ, దుద్దుపూడి సత్యనారా యణ, మొల్లేటి నారాయణమూర్తి, పెదపూడి నరసింహమూర్తి, నల్లల చలపతిరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంస్థ సభ్యులు పేద కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు మానవత సంస్థ పాయకరావుపేట మండల శాఖ చైర్మన్ బాలేపల్లి చినబాబు, టెక్కలి వెంకట రామకృష్ణ తెలిపారు.

ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - పరవాడ: మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను లంకెల పాలెంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా లంకెలపాలెం కూడలిలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమానికి మండల జనసేన పార్టీ ఇన్చార్జి పంచకర్ల ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయి పేరు ప్రతిష్టలు పొందిన మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఇక్కడ వారం రోజులు పండగలా నిర్వహించి వివిధ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక బీజేపీ ఇన్చార్జి కరణం రెడ్డి నర్సింగరావు, పెందుర్తి జనసేన నాయకురాలు గొన్న రమా దేవి, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, రాష్ట్ర తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు ఆకుల అప్పల సూరి, గుటూరు శంకర్రావు, పి.నాగేశ్వరరావు, 84వ వార్డు కార్పొరేటర్ చినతల్లి నీలబాబు, 85వ వార్డు కార్పొరేటర్ వరలక్ష్మి ప్రసాద్, మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీ రామునాయుడు, బలిరెడ్డి అప్పారావు, మాజీ జెడ్పీటీసీ బొద్దపు రమణ, బుగిడి గోవిందరావు, కరణం నర్సింగరావు, సర్వసిద్ధి సన్యాసిరావు, సుందరపు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, గొల్లవిల్లి నాగరాజు, గనిరెడ్డి కనకరాజు, మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు పిల్లా సతీష్, బంతి కోరు గోవిందరాజు, భాస్కరరావు, దాసరి జయ, సేనాపతి రాజు, కన్నం రెడ్డి శ్రీనివాసరావు, మడక బాబ్జి, జెర్రి పోతుల గణేష్ కంటి మంత్రి శివ, తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: ప్రముఖ సినీ హీరో, మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు పాయకరావుపేటలో జనసేన పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు గెద్దం బుజ్జి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మెగా అభిమానులు పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో కేక్ కట్ చేశారు. రోగులకు రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గెద్దం చైతన్య, జగ్గన్న దొర, ఎగదాసు నానాజీ, నారపురెడ్డి పద్మావతి, పల్లి దుర్గారావు, ఆచంట దొర, శివలంక నాగమల్లి, ముక్కుడువల్లి నాగరాజు, గీసాల పద్మావతి, పెదిరెడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ చైర్మన్‌ను సన్మానించిన గ్రామ పెద్దలు

విశాలాంధ్ర - యస్.రాయవరం: ఇటీవల జరిగిన ప్రభుత్వ పాఠశాల యాజమాన్యం కమిటీ ఎన్నికల్లో గెలుపొందిన చైర్మన్‌ను సన్మానించారు. వమ్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కర్రీ శ్రీనును మాజీ సర్పంచ్ దోసపాత్రుని హనుమంతరావు(అంజి) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని పలువురు సూచించారు. ఈ కార్యక్ర మంలో ప్రధానోపా ధ్యాయుడు రమేష్, శ్రీ ఆదర్శ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సీతారామరాజు, టిడిపి జనసేన కూటమి నాయకులు డి.సందీప్, శివ, నారాయణ, సతీష్, దివాణం, వాసు, జానీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో డిస్పోస్ చేయాలి

విశాలాంధ్ర - చోడవరం: ఆసుపత్రుల నుండి వెలువడే వ్యర్థాల కారణంగా ప్రజారోగ్యానికి భంగం కలుగుతుందని, వాటిని శాస్త్రీయ పద్ధతిలో డిస్పోజ్ చేయాలని సి.పి.ఐ., మహిళా ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు వారు గురువారం మీడియాతో మాట్లాడుతూ ఆసుపత్రిలో వచ్చేటువంటి కాటన్, సిరంజిలు ఇతర వ్యర్థాలను సక్రమమైన పద్ధతిలో డిస్పోజ్ చేయడం లేదని, వీటి కారణంగా ప్రజా ఆరోగ్య, వైరల్ సమస్యలు తరచూ తలెత్తుతున్నాయని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల యాజ మాన్యం ఆసుపత్రిలో వెలువడే వ్యర్థాలను బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ వారితో అనుసంధానమై శాస్త్రీయ పద్ధతిలో డిస్పోజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా వ్యర్థ పదార్థాలను విభజించుకొని పసుపు రంగు, ఎరుపు రంగు, నీలం రంగు, పంచర్ ప్రూఫ్ కవర్లలో వేయాలని వేసేముందు ఏ రంగు చెత్తకుండీలో ఏ చెత్త వేయాలో విభజించుకుని అందులో వేసి బయో మెడికల్ డిస్పోజల్ ప్రాంతానికి ఒప్పంద ప్రకారం పంపి వేయాలని సూచించారు. బయో మెడికల్ వేస్ట్ ప్రమాదకరమైనవని, పారవేసే ముందు ఒక్కసారి ఆలోచించాలని తెలియజేశారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం ఆసుపత్రులలో వెలువడే వ్యర్థ పదార్థాలను శాస్త్రీయ పద్ధతిలో డిస్పోస్ చేయక పోతే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలియజేసారు.

గతకుల రోడ్లు బాగు చేయించండి

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం - నర్సీపట్నం బి.ఎన్.రోడ్‌లో గతకుల రోడ్లు బాగు చేసి, తరచూ జరిగే ప్రమాదాలు నివారించి, ప్రజల ప్రాణాలు కాపాడాలని మహిళా, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అసంపూర్తి కల్వర్టులు, గతకుల రోడ్ లో, ఇదే రహదారిలో లక్ష్మీపురం కల్లాల వద్ద తరచూ పలు ప్రమాదాలు జరుగుతున్నాయిని వారు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలినటువంటి కల్వర్టు నిర్మాణాలు, ప్రభుత్వ వైఫల్యం తో గతకుల రోడ్లు వల్ల నేటికీ చాలామంది వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు తరచూ ప్రమాదానికి గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. దయచేసి నేటికైనా అధికార కూటమి ప్రభుత్వం పెద్దలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు రహదారుల సమస్య పరిష్కరించవలసిందిగా మహిళా, ప్రజా సంఘాలు బహిరంగ విన్నవం చేస్తున్నాయి.

గాజువాకలో బైక్ ఆచూకీ లభ్యం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆగస్టు మొదటి వారం ఆనందపురం మండలంలో శొంఠ్యాం పంచాయతీ గొంతువానిపాలెం, ఎంజీఆర్ పురం వాహనదారులు వారి నివాసంలో పార్కింగ్ చేసుకున్న ద్విచక్ర వాహనాలను దొంగలించిన సంగతి తెలిసిందే. గురువారం నిందితుడు ఇన్స్టా ద్వారా ఫోన్ చేసి బైక్ ఇస్తామని కొంత నగదును పట్టుకొని రమ్మని తెలియపరచగా బైక్ యజమానులతో సహా పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకొని నిందితుడిని చాకచక్యంగా పట్టుకుని, నిందితుడు అందించిన సమాచారం మేరకు యమహా ఆర్ 15 ద్విచక్ర వాహనం గాజువాక ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో ఉందని వివరాలు తెలపగా పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకొని బైకును స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మిగతా వాహనాల కోసం దర్యాప్తు చేస్తున్నారు.

13 అడుగుల కింగ్ కోబ్రా హల్‌చల్

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని వీరభద్రపేట గ్రామంలో 13 అడుగుల కింగ్ కోబ్రా హల్ చల్ చేసింది. ఒక ఫంక్షన్ నిమిత్తం గ్రామంలో గల కళ్యాణ మండపం వద్ద తుప్పలు కొడుతుండగా గిరినాగు కనబడడంతో రైతులు భయభ్రాంతులకు గురయ్యారు. మండపంలో ఉన్న రైతులు బయటకు పరుగులు తీశారు. విషయాన్ని గ్రామస్తులు ఫోన్ ద్వారా ఫారెస్ట్ అధికారులకు తెలిపారు. స్నేక్ క్యాచర్ పెచ్చేటి వెంకటేష్ టీం హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కోబ్రాను బంధించడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టుకున్న కోబ్రాను దూరంగా ఉన్న రిజర్వ్ ఫారెస్ట్‌లో వదిలిపెడతామని ఆయన తెలిపారు.

ఘనంగా పినగాడి బంగారమ్మ తల్లి పండగ

విశాలాంధ్ర - పెందుర్తి: మండలంలోని పినగాడి గ్రామదేవత శ్రీ బంగారమ్మ తల్లి పండగ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బయిలపూడి వెంకటలక్ష్మి భగవాన్ జయరాం దంపతులు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు, పసుపు కుంకుమలతో పూజాదికాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హర్ష శర్మ, యశ్వంత్ శర్మ అమ్మవారికి కుంకుమ పూజ, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్న సమయంలో గురువారం ఉదయం మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షం ప్రారంభమైంది. దీంతో సుమారు రెండు గంటల పైగా వర్షం పడటం వల్ల రోడ్లపై నీరు ప్రవహించడం అదే విధంగా పొలాల్లో వర్షం పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.